'చలో హైదరాబాద్'కు కార్మికులు తరలిరావాలి

- 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపు

కార్మిక సంఘాల నాయకులతో కలిసి కరపత్రం ఆవిష్కరిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, సెప్టెంబర్ 14 : సమస్యల పరిష్కారం కోసం కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న చేపట్టనున్న చలో హైదరాబాద్, కార్మిక కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని, కార్మికులంతా కదిలిరావాలని విజ్ఞప్తి చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలిస్తే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా సంక్షేమ పథకాల అమలును ప్రైవేట్ పరం చేస్తోందని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని, ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలని, నిధులు దుబారా కాకుండా చూడాలని కోరారు. గతంలో అసెంబ్లీలో ప్రకటించిన లక్ష మోటర్ సైకిల్స్‌ను కార్మికులకు అందించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10లక్షలు సహజ మరణానికి రూ.5లక్షలు బీమా వర్తింపజేయాలని, ప్రసూతి, దహన సంస్కారాల ఖర్చులకు ఇచ్చే నిధులు రూ. లక్షకు పెంచాలన్నారు. ఆరోగ్యశ్రీని మెరుగుపరిచి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. నాయిని రవి, సీఐటీయూ నాయకులు ఉప్పలయ్య, తేలు సారంగపాణి, పుల్ల అశోక్, సిరికొండ భిక్షపతి, కేబీఎన్కేఎస్ నాయకురాలు సంపూర్ణ, మంజుల, టీఎన్టీయూ జిల్లా కార్యదర్శి కుసుమ శ్యామ్ పాల్గొన్నారు.

వీవోఏల వేతనాలు పెంచాలి

గ్రామాల్లో మహిళా సంఘాలు, ప్రభుత్వ అధికారులు, ప్రజలకు అనుసంధానంగా పని చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీవోఏ)ల వేతనాలు పెంచాలని దాస్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీవోఏల వేతనాలను రూ.25వేలకు పెంచాలన్నారు. మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు వీవోఏలకు రూ.26వేల వేతనాలు ఇవ్వాలని గతంలో అన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రభుత్వానికి వీవోఏలపై ఒక స్పష్టమైన వైఖరి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు రూప్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు మారిపల్లి మాధవి, ప్రధాన కార్యదర్శి మచ్చందర్, కోశాధికారి తిరుపతి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు భిక్షపతి, రమేశ్, హనుమకొండ జిల్లా కన్వీనర్ నాయిని రవి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల పీఆర్‌సీ వెంటనే చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య

కాజీపేట, సెప్టెంబర్ 14 : ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులపై వివక్ష చూపడం సరికాదని, వాయిదా పడిన 5వ పీఆర్‌సీ (డీఏ)ని వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. కాజీపేటలో అసోసియేషన్ స్థానిక అధ్యక్షుడు విశ్వనాథం అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్లలో నిపుణులైన వైద్యులు, సరైన మందులు లేవని, వైద్య పరీక్షలు చేయకపోవడంతో పెన్షనర్లు ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెల్‌నెస్ సెంటర్లలో నిష్ణాతులైన వైద్యులను నియమించాలన్నారు. విరమణ పొందిన ఉద్యోగుల పెండింగ్ మెడికల్ బిల్లులను ఇప్పించేందుకు పాటుపడుతానని హామీ ఇచ్చారు. జిల్లా కార్యదర్శి వీరన్న, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, బాధ్యులు మేరీ, రఘుపతిరావు, సారంగపాణి, కొమురయ్య, ఆనందం, మల్లేశం, బ్లూ చీఫ్ బ్రాంచి మేనేజర్ రజాక్ పాల్గొన్నారు.

ఆత్మకూరు సొసైటీ చైర్మన్ రవీందర్ సస్పెన్షన్

రవీందర్‌గౌడ్

ఆత్మకూరు, సెప్టెంబర్ 14 : ఆత్మకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన అవినీతి అక్రమాలకు పాల్పడిన చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ డీసీవో నీరజ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.ఇటీవల సొసైటీ డైరెక్టర్ నత్తిసుధాకర్, రేవూరి జయపాల్‌రెడ్డి, కంచే సతీశ్‌లతో పాటు పలువురు డైరెక్టర్లు, రైతుల నుంచి అక్రమంగా సొసైటీ చైర్మన్ ఏరుకొండ రవీందర్ డబ్బులు వసూళ్లు చేశారని వివరాలతో డీసీవోకు ఫిర్యాదు చేశారు. విచారణ చేయగా అవినీతికి పాల్పడ్డాడని నిరూపణ జరిగింది. దీంతో డీసీవో నీరజ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు నెలల పదవికాలం ముందు చైర్మన్‌ను సస్పెండ్ కావడంతో వైస్ చైర్మన్ జనగాం ప్రభాకర్‌గౌడ్‌ను ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమిస్తు, జిల్లా కోఆపరేటివ్ సహకార సంఘం అధికారి నీరజ ఉత్తర్వులను జారీ చేశారు.

అన్నిదానాల్లో అన్నదానం మిన్న

ఎస్సైని సత్కరిస్తున్న మండప నిర్వాహకులు

శాయంపేట, సెప్టెంబర్ 14 : అన్ని దానాల్లో అన్నదానం మిన్న అని ఎస్సై ప్రమోద్‌కుమార్ అన్నారు. శాయంపేట బస్టాండ్ సెంటర్‌లోని వినాయక మండపం వద్ద శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఎస్సైని శాలువాలతో నిర్వాహకులు సత్కరించారు. నిర్వాహకులు సామల రవీందర్, దాసని సదానందం, మార్త సుమన్, బాసాని సతీష్, కుసుమ వెంకన్న, భాస్కర్ పాల్గొన్నారు. పత్తిపాక రోడ్డులోని వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై ప్రారంభించారు.

'నిట్'లో హిందీ దివస్

హనుమకొండ చౌరస్తా/న్యూశాయంపేట, సెప్టెంబర్ 14 : నిట్‌లో హోం వ్యవహారాలు, విద్యా మంత్రిత్వ శాఖల ఆదేశాల మేరకు హిందీ పఖ్వాడా వేడుకలను ప్రారంభించారు. హిందీ వ్యాస రచన, ప్రసంగం, క్విజ్, కవి సదస్సు నిర్వహించినట్లు హిందీ అధికారి ఆదేశ్ శ్రీవాస్తవ్ తెలిపారు. విద్యార్థి సంక్షేమ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య, సాహిత్య, డిబేట్ క్లబ్ అధ్యాపక సలహాదారు ప్రొఫెసర్ అల్తాఫ్ బాదర్ పాల్గొన్నారు. హంటర్ రోడ్డులోని ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలిక గురుకులంలో హిందీ భాషా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయురాలు సల్ల శైలజ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు అడ్లూరి దేవీప్రసాద్, సువర్ణ, కరుణాదేవి, దోమలపల్లి ఇందిర పాల్గొన్నారు.

కిట్స్‌లో టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

హసన్‌పర్తి, సెప్టెంబర్ 14 : ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని ఇండోర్ స్టేడియంలో డబ్ల్యూడీటీడీఏ అధ్యక్షుడు ఆకారపు హరీశ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పోటీలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 47 జట్లు, 130 మంది క్రీడాకారులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో సుస్మిత, కిట్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, రాష్ట్ర డబ్ల్యూడీటీటీఏ ప్రధాన కార్యదర్శి రమేశ్‌రెడ్డి, పీఆర్‌వో ప్రభాకరాచారి పాల్గొన్నారు.

డీజే ఆపరేటర్ల బైండోవర్

హసన్‌పర్తి, సెప్టెంబర్ 14 : మండలంలోని డీజే ఆపరేటర్లను శనివారం తహసీల్దార్ చల్లా ప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ చేరాలు తెలిపారు. సోమవారం గణేశ్ నిమజ్జనం ఉన్నందున గణేశ్ మండప నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాలన్నారు. అలాగే డీజే ఆపరేటర్లు గణేశ్ శోభాయాత్రలో డీజేలు పెట్టవద్దని హెచ్చరించారు.

బాధితులకు చల్లా పరామర్శ

శ్రీధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న చల్లా

దామెర, సెప్టెంబర్ 14 : అనారోగ్యంతో బాధపడుతున్న ఓగులాపురానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, జర్నలిస్టు మన్నెం ఇంద్రారెడ్డి, ఊరుగొండ గ్రామానికి చెందిన మల్లాడి సింధును మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. మండలాధ్యక్షుడు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, మల్లాడి రాజిరెడ్డి, కాంతాల కేశవరెడ్డి, పుల్యాల రఘుపతిరెడ్డి, రాజేశ్వర్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

24న బల్దియా సర్వసభ్య సమావేశం

వరంగల్, సెప్టెంబర్ 14 : వరంగల్ మహా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 24న నిర్వహించనున్నారు. రెండు రోజులుగా బల్దియా సర్వసభ్య సమావేశంపై మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కసరత్తు చేశారు. పాలక మండలి ఆమోదం కోసం 15 ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎజెండాలో చేర్చనున్నారు.

24న జేఎన్ఎస్‌లో యువజనోత్సవ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 14 : 28వ జాతీయ యువ జనోత్సవాల సందర్భంగా జిల్లా స్థాయి యువ కళాకారుల ఎంపిక ఈనెల 24న జేఎన్ఎస్‌లో నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 15 నుంచి 29 సంవత్సరాల్లోపు ఉండాలని, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని డిసెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు పంపిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు జాతీయస్థాయి యువజనోత్సవాలకు హాజరవుతారన్నారు. ఇందులో థీమ్-ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జానపద నృత్యం గ్రూప్, సోలో, జానపద పాటలు గ్రూప్, వ్యక్తిగతం, కవిత్వం, కథా రచన, పెయింటింగ్, ఉపన్యాసం వక్తృత్వం (హిందీ, ఇంగ్లిష్), హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తిపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీతారాం ఏచూరికి నివాళి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 14 : ప్రజా సమస్యలపై జీవితాంతం పోరాటం చేసిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని భారత డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుగ్గెల తిరుపతి అన్నారు. హనుమకొండ కుమార్‌పల్లిలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు గ్యారె వినీల్‌కుమార్, జంపాల రాజేందర్, దయ, కేశవ, మనోజ్, నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు తూముల సదానందం, రంగారావు, ప్రభాకర్, వంశీ పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులు రాణించాలి

దామెర, సెప్టెంబర్ 14 : భూపాలపల్లిలో ఈనెల 13న జరిగిన జిల్లా సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఓగులాపురం మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర(సంగెం)పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ యాదగిరి శనివారం అభినందించారు. డీ అఖిల్‌రెడ్డి, ఏ విద్యాకర్, ఎల్ భరత్, డీ మహేందర్, పీ అరవింద్ బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు. ఉపాధ్యాయులు అశోక్, రేణుక, సృజన పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

- చదివిన పాఠశాలకు సేవ చేయడం నా అదృష్టం
- సంగారెడ్డి ఎస్సీ చెన్నూరి రూపేశ్
- పాఠశాలల అభివృద్ధికి కృషి : కలెక్టర్ ప్రావీణ్య

విద్యార్థులకు పోటీ పరీక్షల బుక్స్ పంపిణీ చేస్తున్న ఎస్సీ రూపేశ్, కలెక్టర్ ప్రావీణ్య

హసన్‌పర్తి, సెప్టెంబర్ 14 : విద్యార్థులు ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చని సంగారెడ్డి ఎస్సీ చెన్నూరి రూపేశ్ అన్నారు. హసన్‌పర్తి జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల, జూనియర్ కళాశాల అభివృద్ధి కోసం పలువురు చెక్కుల రూపంలో రూ.25 లక్షలు శనివారం అందజేశారు. ముఖ్యఅతిథులుగా రూపేశ్, కలెక్టర్ ప్రావీణ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదివానన్నారు. రూ.7లక్షల విలువైన పోటీ పరీక్షల (జేఈఈ, మెయిన్స్) పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.18లక్షల విలువైన చెక్కును సత్యనారాయణ, రూ.7లక్షల చెక్కును డాక్టర్ ఉదయ్ అందజేయడం అభినందనీయమన్నారు. కలెక్టర్ నిధుల నుంచి రూ.10లక్షలతో మిషన్ భగీరథ, తాగునీటి పనులు, రూ.5.50లక్షలతో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల నుత్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు రూ.50 వేలు అందజేస్తానన్నారు. హెచ్ఎంలు విజయలక్ష్మి, సుమాదేవి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్దచెరువు కట్టపై ఓపెన్ జిమ్, హైస్కూల్‌లో క్రీడా ప్రాంగణం, డిజిటల్ గ్రంథాలయం, తహసీల్దార్ ఆఫీస్ నుంచి ఎల్లాపూర్ వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులతో చర్చించి పనులు అయ్యేలా చూస్తానని కలెక్టర్ చెప్పారు.

నేటి నుంచి దూరవిద్య ఎమ్మెస్సీ ఫైనల్ తరగతులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 14 : కేయూ దూరవిద్య కేంద్రం అందిస్తున్న పీజీ ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్ కోర్సుల ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 15 నుంచి తరగతులు మొదలవుతాయని సంచాలకుడు వల్లూరి రామచంద్రం, సహాయ సంచాలకుడు బట్టి వెంకట గోపీనాథ్ తెలిపారు. విద్యార్థులు గణితశాస్త్రం విభాగం సెమినార్ హాల్ వద్దకు రావాలన్నారు.

జిల్లాలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేయాలి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 14 : అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేయాలని శనివారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డిని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి మార్నేని ఉదయభాను కోరారు. హనుమకొండలోని ఇనుగాల స్వగృహంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బండారి ప్రభాకర్, మట్టెడ కుమార్, మహ్మద్ అఫ్జల్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో శశాంక్‌కు కాంస్య పతకం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 14 : తమిళనాడులోని శివగంగాయి జిల్లా కారికుడిలో జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ తైక్వాండో పోటీల్లో హనుమకొండ సెయింట్‌పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన గుజ్జేటి శశాంక్ అండర్-14 బాలుర విభాగంలో కాంస్య పతకం సాధించాడు. కోచ్ వావిలాల నరసింహ వద్ద శిక్షణ పొందుతున్న శశాంక్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కోచ్ విఠల్, సీబీఎస్ఈ పర్యవేక్షకుడు దురై, ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీ కులగణనపై కోర్టు తీర్పును అమలు చేయాలి

సమావేశంలో పాల్గొన్న ఆలిండియా ఓబీసీ జాక్ నాయకులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 14 : ఎన్నో ఉద్యమాల ఫలితంగా ఇటీవల తెలంగాణ హైకోర్టు బీసీ కుల జనగణనపై ఇచ్చిన తీర్పుననుసరించి ప్రభుత్వం మూడు నెలల్లోపు సమగ్ర కుల జనగణన జరిపి, స్థానిక సంస్థలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ కుమార్‌పల్లిలో జాక్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. న్యాయపరమైన చిక్కులు లేని విధంగా సమగ్ర కుల జనగణన జరిపి బీసీలకు న్యాయం చేయాలని, 50శాతం సీలింగ్ విధానాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కుల జనగణన అంశం కేంద్ర ప్రభుత్వం చూడాల్సిన అంశమని, కావాలనే కేంద్రం రాష్ట్రాల మీదికినెట్టి బీసీలకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. ప్రొఫెసర్ సారంగపాణి మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బీసీలకు వాటా దక్కడం లేదని, యూనివర్సిటీ వీసీల నియామకాల్లో 50శాతం బీసీలకు చేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జిల్లాల పూలే యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తాడిశెట్టి క్రాంతికుమార్, కేయూ విద్యార్థి నాయకుడు గొల్లపల్లి వీరస్వామి, వివిధ సంఘాల నాయకులు తాటికొండ సద్గుణ, వెంకటాచారి, నలబాల రవికుమార్, నారాయణగిరి రాజు, నలుబోల అమరేందర్, అనిశెట్టి సాయితేజ, నలుబోల సంజయ్‌కుమార్, న్యాయవాది సుందర్‌రామ్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో యువతకు ఉద్యోగావకాశాలు

- క్యాంపు కమాండెంట్ కర్నల్ ఎస్‌కే భద్ర
- కేయూలో ముగిసిన క్యాంపు

మాట్లాడుతున్న కమాండెంట్ కర్నల్ ఎస్‌కే భద్ర

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 14 : ఎన్‌సీసీని సెకండ్ ఆర్మీగా పరిగణిస్తారని, ఎన్‌సీసీతో యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని క్యాంపు కమాండెంట్ కర్నల్ ఎస్‌కే భద్ర అన్నారు. ఖమ్మం ఎన్‌సీసీ 11 తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఈ నెల 6న ప్రారంభమైన ఎన్‌సీసీ కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు ఆదివారంతో ముగియనుంది. యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి యూనివర్సిటీ హాస్టల్ డైరెక్టర్ ఎల్పీ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వెంకయ్య, యూనివర్సిటీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాసుదేవరెడ్డి హాజరయ్యారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ అన్ని రకాల యూనిఫామ్ ఉద్యోగాలకు ఉపయోగపడుతుందని, 15 లక్షల మంది విద్యార్థులు ఇందులో చేరారన్నారు. క్యాంప్ డిప్యూటీ కమాండెంట్, లెఫ్టినెంట్ కర్నల్ నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈ పది రోజుల్లో విద్యార్థులకు ఫైరింగ్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కల్చరల్ యాక్టివిటీస్‌పై శిక్షణ ఇచ్చామన్నారు. క్యాంపులో ఎన్‌సీసీ ఆఫీసర్స్ లెఫ్టినెంట్ ఓంకార్, ప్రభాకర్, జీవన్‌కుమార్, శ్రీనివాస్ ఖలీలుద్దీన్, ప్రభాకర్‌రావు, శంకర్, శేఖర్, సుబేదార్ మేజర్ లలిత్ సింగ్, ట్రైనింగ్ జేసీవో రాజారాం పాల్గొన్నారు.

చెరువులు, కుంటల కబ్జాదారులపై ఉక్కుపాదం

- ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో 'వాడ్రా' తీసుకొస్తాం
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి

ఆత్మకూరు : కటాక్షపురం పెద్ద చెరువు వద్ద నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో నారాయణ, ఏసీపీ కిశోర్‌కుమార్

వరంగల్, సెప్టెంబర్ 14 : నగరంలో చెరువులు, కుంటలు కబ్జా చేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మేయర్ గుండు సుధారాణితో కలిసి పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని నిమజ్జన చెరువుల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. బంధంచెరువు, పద్మాక్షి గుండాన్ని పరిశీలించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే అనేక చెరువులు, కుంటలు కబ్జా అయ్యాయన్నారు. కబ్జాలు చేసిన వారికి అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. నగరంలో ఐపీఎస్ అధికారి సారథ్యంలో హైడ్రా తరహాలో వాడ్రా చట్టం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు. కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, మానస-రాంప్రసాద్, సీఎంహెచ్‌వో రాజేశ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఈ సంతోష్‌బాబు, తహసీల్దార్ భావ్‌సింగ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్, మాజీ కార్పొరేటర్లు అబూబక్కర్, మాధవీరెడ్డి పాల్గొన్నారు.

నయీంనగర్: నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఎమ్మెల్యే నాయిని కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

ఆత్మకూరు/ఎల్కతుర్తి/హనుమకొండ: కటాక్షపురం పెద్ద చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పనులను శనివారం పరకాల ఆర్డీవో నారాయణ, ఏసీపీ కిశోర్‌కుమార్ పరిశీలించారు. చెరువు వద్ద క్రేన్, బారికేడ్లు, లైటింగ్, టెంట్, మైక్ సెట్ ఏర్పాట్లు చేయడంతో పాటు కట్టను చదును చేయాలన్నారు. తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, సిఐ సంతోశ్‌కుమార్, డీఈ వేణుగోపాల్ పాల్గొన్నారు. నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్ చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ నిమజ్జనం జరిగే చెరువులు, కుంటలను ఆయన ఎస్సై రాజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. సమస్యలుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. అలాగే నగరంలో వినాయ నిమజ్జనం చేసే ప్రాంతాలను విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. సీఈ, ఆపరేషన్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ మధుసూదన్, ఎస్ఈ వెంకటరమణ, డీసీ సాంబారెడ్డి నిట్ సమీపంలోని బంధం చెరువు, మడికొండలోని చల్ల చెరువు, హనుమకొండలోని సిద్ధేశ్వర గుండం, పలవేల్పుల చెరువును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

మార్కెట్‌లోకి టాటా 'కర్వ్' కొత్త మోడల్ కారు

టాటా కర్వ్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు నాయిని, దొంతి, కుడా చైర్మన్ ఇనుగాల

వరంగల్, సెప్టెంబర్ 14 : ఇండియాలో ఆటోమొబైల్ రంగంలో ఆగ్రగామిగా ఉన్న టాటా కంపెనీ కొత్త మోడల్ కారు మార్కెట్‌లోకి వచ్చింది. శనివారం ములుగురోడ్డులోని సెలక్ట్ మోటర్స్ షోరూంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, టాటా మోటర్స్ రీజినల్ మేనేజర్ గోపీకృష్ణ కొత్త మోడల్ 'కర్వ్' కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. సెలక్ట్ గ్రూప్ అధినేత ముప్పిడి విజయకుమార్‌రెడ్డి కారు ప్రత్యేకతలను వివరించారు. కర్వ్ మోడల్ కారు పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ మోడళ్లలో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ప్రారంభ ధర రూ.9,99,900, గరిష్ట ధర రూ.18.99 లక్షల వరకు ఉందని వివరించారు. అత్యంత ఆధునిక ఫీచర్స్, భద్రతతో తీర్చిదిద్దారని తెలిపారు. ఎలక్ట్రిక్ కారు ఒక్కసారి చార్జింగ్ చేస్తే 502 నుంచి 585 కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చని చెప్పారు.

హోండా 'అల్కజార్' కొత్త మోడల్ కారు విడుదల

హోండా 'అల్కజార్' కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఏసీపీ దేవేందర్